ఖమ్మం నగరాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మార్చి 12: ఖమ్మం నగరాభివృద్ధికి ప్రణాళిక ప్రకారం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.249 కోట్ల 52 లక్షలతో మురుగు నీటి పైప్‌లైన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఖమ్మం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు సంబంధించిన వివరాలను పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ ఖమ్మం డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ వి.రంజిత్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు ప్రశాంతమైన ఖమ్మం నగరాన్ని తయారు చేస్తున్నామని, శాంతి భద్రతలు పకడ్బందీగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, హన్మంతరావు, ఆర్డీవో నరసింహారావు, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల ప్రాంగణం తీర్చిదిద్దాలి
కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మార్చి 12 : మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీధి వ్యాపారుల ప్రాంగణం అనువుగా ఉండే విధంగా ప్రణాళిక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కూరగాయలు అమ్మే షెడ్లు, స్టాల్స్, తోపుడుబండ్లను చూస్తూ ప్రాంగణం మొత్తం కలియతిరిగి పరిశీలించారు. కూరగాయల వ్యాపారులతో ముచ్చటించారు. సమస్యల పరిష్కారానికి అధికారులను పంపించి ప్రతిపాదనలు సిద్ధం చేయించి, పనులు చేస్తామని భరోసా కల్పించారు.

కాగ్నిజెంట్‌కు ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

విద్యార్థులతో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం అర్బన్, మార్చి 12 : ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ కాగ్నిజెంట్‌కు ఇద్దరు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ బుధవారం తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షలో వివిధ దశల్లో అర్హత కనబర్చిన నితిన్, మృదిని ఉద్యోగాలు సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అభినందించారు.

కొనసాగుతున్న సైలో బంకర్ బాధితుల దీక్షలు

దీక్షల్లో కూర్చున్న అంబేద్కర్ కాలనీవాసులు

సత్తుపల్లిటౌన్, మార్చి 12 : సైలో బంకర్‌తో తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని, దానిని తొలగించాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన అంబేద్కర్ కాలనీ వాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 31వ రోజుకు చేరాయి. దీక్షల్లో భాగంగా రోజుకో రీతిన ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షల్లో కొండా నాగరత్నం, వాడపల్లి నాగమణి, వాడపల్లి అరుణ, జాన్‌బీ, మదీన తదితరులు కూర్చున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కారేపల్లి, మార్చి 12: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్ పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ జాబితాలోని అన్ని కులాలకు సమన్యాయం జరగాలన్నారు. నాగరాజు, నాగేంద్రబాబు, నాగరాజు, వెలగాడు, రవి, సాంబ, హరి, శంకర్, బాలకృష్ణ, రామారావు, రాములు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయాభివృద్ధిని సాధించాలి
జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

రఘునాథపాలెం, మార్చి 12 : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిని సాధించడంలో విత్తన పురుగుల మందుల డీలర్లు ప్రముఖ పాత్ర పోషించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. బుధవారం రఘునాథపాలెం మండల పరిధి వీ వెంకటాయపాలెం రైతువేదికలో ఆత్మ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ ఎక్స్‌టెన్షన్ ఫర్ ఇన్పుట్ డీలర్(దేశీ) కార్యక్రమం జరిగింది. దీనికి డీఏవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విత్తన, పురుగుల మందుల డీలర్లు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని క్షేత్రస్థాయిలో రైతులకు మంచి ఎరువుల విత్తనాలను సరఫరా చేసి నాణ్యమైన పంట ఉత్పత్తులను పొందడంలో కృషి చేయాలన్నారు. ఆత్మ జిల్లా పీడీ అభిమన్యుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ శిక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం 80 మందికి సర్టిఫికెట్లను అందజేశారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు

మాట్లాడుతున్న అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మి

ఖమ్మం అర్బన్, మార్చి 12 : ఈ నెల 21వ తేదీ నుంచి జరగనున్న పది పరీక్షల్లో విధులు నిర్వహించే వారికి కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమతి లేదని అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మి అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని అర్బన్ ఎంఈవో కార్యాలయంలో అర్బన్ పరిధిలోని 27 కేంద్రాల సీఎస్, డీవోలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు సీఎస్, డీవోలే కీలకమన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో డీఈవో, ఎంఈవోల మొబైల్ నెంబర్లను స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం హాల్‌టిక్కెట్లు, మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సీడీపీవో

అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీవో కనకదుర్గ

వేంసూరు, మార్చి 12: మండలంలోని బీరపల్లి సర్కిల్ ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ బుధవారం కొండగట్ల అంగన్‌వాడీ-1 కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ స్కూల్, రిజిస్టర్లు పరిశీలించారు. కొండగట్ల- 2, జే.సీ.పురం అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ భవానీ సమక్షంలో సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు, సలహాలు చేశారు. తల్లులు తీసుకోవాల్సిన ఆహారం, పరిశుభ్రత, తాగునీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దప్పట్లు, దిండ్లు పంపిణీ

విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హన్మంతరెడ్డి

ఖమ్మం రూరల్, మార్చి 12: ఏదులపురంలోని డేర్ కళాశాలలో కొనసాస్తున్న టేకులపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులకు యూనియన్ బ్యాంక్ అధికారులు బుధవారం దిండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సామాజిక కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాని చేపట్టినట్లు యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ హన్మంతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. నారీశక్తి స్కీంతో మహిళలకు రుణాలు అందజేస్తున్నామని, వారిలో చైతన్యం తెచ్చేందుకు వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఏజీఎంలు సర్వేష్, సుధాకర్‌రావు, చీఫ్ మేనేజర్ ప్రియదర్శిని, డేర్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, గురుకుల పాఠశాల కరస్పాండెంట్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై గృహోపకరణాలు దగ్ధం

సత్తుపల్లిటౌన్, మార్చి12: గ్యాస్ లీకై అగ్ని ప్రమాదంలో చోటు చేసుకున్న ఘటన సత్తుపల్లి పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి పట్టణంలోని ద్వారకానగర్‌కాలనీలో జే.వెంకటేశ్వరరావు, అంజమ్మ ఇంట్లో సాయంత్రం 4గంటల సమయంలో పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న వాషింగ్‌మిషన్, ఫ్రిడ్జ్, ఇంటి తలుపులు, కిటికీలు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు సత్తుపల్లి అగ్నిప్రమాక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు వితరణ

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల, మార్చి 12: మండలంలోని తినకెళ్ల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో చేతన ఫౌండేషన్ వారి సహకారంతో పదోతరగతి విద్యార్థులకు బుధవారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం డీ.శ్రీనివాస్ సమక్షంలో పరీక్షా ప్యాడ్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ బాధ్యులు దొడ్డా సీతారామయ్య, సీ.హెచ్.నవీన్, ఎస్.కే.రషీద్, వీ.రామ్మోహన్‌రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలి

జడ్పీ సీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం అర్బన్, మార్చి 12 : ఇటీవల జరిగిన బదిలీలు, ప్రమోషన్లలో ఇతర జిల్లాలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల జీపీఎఫ్ సొమ్మును వారి ఖాతాలకు వడ్డీతో సహా బదిలీ చేయాలని జడ్పీ సీఈవో దీక్షారైనాను కలిసి పీఆర్‌టీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు, పెన్షనర్ల సంఘ బాధ్యులు కందుల వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సత్తుపల్లిటౌన్, మార్చి 12: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సత్తుపల్లిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం వైపు నుంచి ఓ వ్యక్తి పూటుగా మద్యం తాగి బైక్‌పై అతివేగంగా వస్తున్నాడు. అదే సమయంలో జవహర్‌నగర్‌కు చెందిన చప్పిడి హేమంత్, పెండ్ర వెంకన్న ఇంటి నుంచి బైక్ కొనుగోలు నిమిత్తం సెంటర్‌కు వచ్చి నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి సత్తుపల్లిలోని హాయ్ స్పందన భోజన హోటల్ వద్ద వాహనాన్ని ఢీకొట్టి ఎదురుగా నడుచుకుంటూ వెళ్తున్న వీరిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

'తెలుగు.. అద్భుతమైన భాష'

ఖమ్మం అర్బన్, మార్చి 12 : తెలుగు భాష అద్భుతమైన జీవద్భాష అని, సరళంగా, ఒత్తులేకుండా రాయడానికి ఆస్కారమున్నదని భాషా పరిశోధకుడు, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు లిపి- సరళత ఒత్తులేకుండా-ఒత్తిడి లేకుండా తెలుగు రాయడం అనే అంశంపై ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాకీరుల్లా, రవికుమార్, సీతారాం, ఎంవీ రమణ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి పరీక్షలు

ఖమ్మం లీగల్, మార్చి 12 : ఈ నెల 22వ తేదీన ఖాళీ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఖమ్మంలో గల ఉద్యోగాలకు గత నవంబర్ 13న నోటిఫికేషన్ జారీ చేసింది. దానిప్రకారం సంబంధిత ఉద్యోగాలకు చైర్మన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేనో, టైపిస్టు పరీక్ష ఉదయం 9 నుంచి 9:45 గంటల వరకు, టైపిస్టు కం అసిస్టెంట్ పరీక్ష 10:15 నుంచి ఉదయం 11గంటల వరకు, జూనియర్ అసిస్టెంట్ పరీక్ష మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు, రికార్టు అసిస్టెంటు పరీక్ష 2:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు http//khammam.dcourts.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు.

కల్లూరులో భద్రాద్రి బ్యాంక్ ప్రారంభం

బ్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుబల్లి, మార్చి12: ప్రైవేటు రంగంలో ఉన్న సహకార బ్యాంకులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు కోరారు. బుధవారం కల్లూరులో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తమ బ్యాంకు రూ.930 కోట్లతో వ్యాపారం నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ దాసరి వేణుగోపాల్, మద్ది పిచ్చయ్య, ఉదయప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంలో కొనసాగుతున్న ఐటీ సోదాలు

ఖమ్మం అర్బన్, మార్చి 12 : ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ సోదాలు బుధవారం కూడా కొనసాగాయి. అధికారులు విద్యార్థుల ఫీజులకు సంబంధించిన రశీదులు, విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్‌కు సంబంధించిన ఆడిటర్లను సైతం ప్రశ్నించినట్లు తెలుస్తుంది. ట్యాక్స్ చెల్లించే విషయంలో అందజేసిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే సోదాలు జరుగుతున్న కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతుండడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

వైరాటౌన్, మార్చి12: వైరా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కల్వ సుజాత ఆర్యవైశ్య అభిమాన సంఘం నాయకుడు గ్రంధి ప్రవీణ్‌కుమార్ సోదరి దాసపాటి ఆకాంక్ష పుట్టినరోజు సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపీ స్కూల్ శాంతినగర్ ఎస్టీ కాలనీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

మిస్ట్ కళాశాలలో క్రీడాపోటీలు

మాట్లాడుతున్న కల్లూరు ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్, మార్చి 12: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ క్రీడాపోటీలను బుధవారం కల్లూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరం ఎక్కడైతే ఆరోగ్యంగా ఉంటుందో అక్కడ మనస్సు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందాలంటే పాఠశాల, కళాశాలస్థాయి నుంచి వివిధ క్రీడాపోటీలో పాల్గొనడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు. కిరణ్, టీ.కవిత, చలసాని హరికృష్ణ, చలసాని సాంబశివరావు, కంచర్ల సత్యనారాయణ, కొత్తూరు ప్రభాకర్‌రావు, కొత్తూరు సత్యనారాయణ, డాక్టర్ ఎ.బీ.శ్రీనివాసరావు, డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఎం.వీ.రామచంద్రరావు, పీ.మారేశ్వరరావు, డాక్టర్ ఎల్.వీ.ఆర్.దీక్షితులు, ఎం.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతిపై కిసాన్ మేళా

కిసాన్ మేళాలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, కేవీకే సిబ్బంది

వైరాటౌన్, మార్చి 12: కృషి విజ్ఞాన కేంద్రం వైరాలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై బుధవారం కిసాన్ మేళా నిర్వహించారు. పత్తి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో సాగు మెలకువలపై రైతులకు వివరించారు. వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. ప్రస్తుతం వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ జిల్లాలో ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, ఫణిశ్రీ, విశ్వవిద్యాలయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ మెంబర్ రాణాప్రతాప్, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

చేపల సొసైటీ సభ్యత్వం కల్పించాలి

పెనుబల్లి, మార్చి12: కల్లూరు మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన ఊరచెరువు చేపల సొసైటీలో తమకు సభ్యత్వం కల్పించాలని దళితులు బుధవారం రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. మోదుగు అబ్రహ్మం, దిరిసినపు పుల్లయ్య, మోదుగు తిరుపతయ్య, మోదుగు ఏసురత్నం, మోదుగు అనమయ్య, కటుకూరి వెంకటేష్, అరిగెల యోహాను, మోదుగు పుల్లయ్య, మోదుగు బూసి ఉన్నారు.

శాంతమ్మకు పలువురు నివాళి

పెనుబల్లి, మార్చి12: నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్కినేని కిశోర్‌కుమార్ మాతృమూర్తి కల్లూరుకు చెందిన లక్కినేని శాంతమ్మ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని తెలంగాణ ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం

వేంసూరు, మార్చి12: మండలంలోని కందుకూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారి కళ్యాణం, గురువారం నుంచి ఎడ్ల బండ్లలాడుగు పోటీలు ప్రారంభమవుతాయని ఆలయ చైర్మన్ ఒగ్గు సత్యనారాయణరెడ్డి తెలిపారు. గొర్ల వెంకటప్పారెడ్డి, కొప్పుల వెంకటేశ్వరరెడ్డి, తెలగారపు చెన్నారావు, బూరుగు విజయ్‌కుమార్, సందెపోగు పుల్లయ్య, ఎస్.కే.మౌళాలి, లక్ష్మారెడ్డి, మేడిది ఈశ్వరాచారి, చీపు రాఘవులు పాల్గొన్నారు.

ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న మహిళలు

సత్తుపల్లిటౌన్, మార్చి12: మండల పరిధిలోని సిద్ధారం గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఐద్వా సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి జెండా ఆవిష్కరించారు. రేసు లక్ష్మీ, వాసం నిర్మల, ఎలగం వెంకటలక్ష్మి, సుధారాణి, సమ్మక్క, చెన్నమ్మ, జయమ్మ, మంగ, రమాదేవి, కిరణ్మయి పాల్గొన్నారు.

మహాప్రస్థాన వాహనం, ఫ్రీజర్ బాక్స్ ప్రారంభం

ఫ్రీజర్‌బాక్స్‌ను ప్రారంభిస్తున్న దాతలు

పెనుబల్లి, మార్చి 12: మండల కాకతీయ కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రస్థానం ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రస్థానం వాహనానికి నిధులు అందజేసిన పోపూరి అంకినీడు ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభించారు. కనగాల సాంబశివరావు, సూర్యదేవర రవికుమార్, చీకటి నరసింహారావు, సుంకర సత్యనారాయణ, గోగినేని రమేష్, పీ.వీ.ప్రసాద్, బెల్లంకొండ శ్రీనివాసరావు, బెల్లంకొండ చలపతి, వాణీపతిరావు, కొప్పుల గోవిందరావు, మందడపు అశోక్‌కుమార్, జిజ్జవరపు పుల్లయ్య, మేకతొట్టి కాంతయ్య, భూక్యా ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొణిజర్ల, మార్చి 12: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని శాంతినగర్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుద్దిపుడి గ్రామానికి చెందిన అమర్లపుడి పుల్లయ్య (55) శాంతినగర్‌లోని ఓ చర్చిలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని ఖమ్మం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

మాలతి మృతికి నివాళి

అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు

కొణిజర్ల, మార్చి 12: సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ కార్యకర్త, అరుణోదయ నాయకురాలు మండలంలోని రామనర్సయ్యనగర్ గ్రామానికి చెందిన బాణోతు మాలతి బుధవారం మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని నాయకులు సందర్శించి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్.వెంకటేశ్వరరావు, ఝాన్సీ, ఎం.శ్రీనివాసరావు, నాగన్న, లక్ష్మక్క, ఎం.రాజేంద్రప్రసాద్, ఎం.గిరి, కోలా లక్ష్మీనారాయణ, అర్జున్‌రావు, ఆంగోతు భాష, పఠాన్ ఖాసీంఖాన్, భూక్యా శంకర్ ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొణిజర్ల, మార్చి 12: మండలంలోని తనికెళ్ల గ్రామ శివారులో ఎన్ఎస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎన్ఎస్పీ కాలువలో మృతదేహం కొట్టుకొస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అన్నం సేవా ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, వారి సిబ్బంది వారి వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసు